పెద్దకథ:

తెలిసి చేసిన పాపం

— పాటిబండ్ల విజయలక్ష్మి

రావుగారి జీవితంలో మధురమైన వరం శోభాదేవి. అన్యోన్యమైన దాంపత్యం వారిది. చీకూచింతా లేని జీవితం, తనకోసం ప్రాణమైనా యివ్వడానికి వెనుకాడని భార్య శోభ....వంశోద్ధారకుడుగా పుట్టిన దినేష్ ఏనాడూ దేనికీ బాధపడటమంటే ఏమిటో కూడా తెలీకుండానే పాతిక సంవత్సరాల సంసార జీవితం సాఫీగా హాయిగా సాగిపోయింది. పాతిక సంవత్సరాలు గడిచిపోయినట్టే తెలీలేదు రావుగారికి.

అందరికీ లభించని అరుదైన అదృష్టం శోభ రూపంలో బీద విద్యార్థిగా వాళ్ళింట స్థానాన్ని సంపాదించిన వేణుగోపాలరావును వరించింది. ఆమెతోపాటే అతని జీవితంలో వెలుగూ వెన్నెలా ఒక్కసారిగా వచ్చిపడ్డాయి. ఆ తర్వాత ఎప్పుడూ అంధకారమయమైన గత దినాల ఒంటరితనం, ఏకాకిననే ఆక్రందన, అతనికి జ్ఞాపకం రాకుండా చేసింది ఆమె సాన్నిహిత్యం.

ఒక్కగానొక్క గారాలపట్టి శోభ అభీష్టాన్ని కాదనే ధైర్యం లేని రాజారాంగారు, అనాథైన వేణుగోపాల్‌ను అల్లుడిగా చేసుకోక తప్పలేదు. తల్లిలేని శోభ మనసు నొప్పించడం యిష్టం లేక ఆమె యిష్టప్రకారం వారి వివాహం చేశారు. కానీ ఆ తర్వాత కూడా ఎప్పుడూ ఆయన వేణును అల్లుడిగా చేసుకున్నందుకు పశ్చాత్తాపపడలేదు. తనకు కొడుకుల్లేని లోటు వేణు తీర్చాడనే గర్వంగా చెప్పుకునేవారు. తమ యింటి అల్లుడైన మరుక్షణం నుంచీ అతని మంచి చెడ్డల బాధ్యతను తను తీసుకున్నారు. తనకు సమానంగా గొప్ప హోదా గల ఆఫీసర్‌ను చేయాలనుకున్నారు.

రాజారాంగారి ఆశయాల కనుగుణంగా శ్రద్ధగా చదివి గోల్డ్‌మెడల్ సంపాదించడమే కాకుండా, అతి స్వల్ప వ్యవధిలో ఐ. ఏ. యస్ ఆఫీసర్ కాగలిగాడు వేణుగోపాలరావు. అల్లుడూ కూతురూ రెండు కళ్ళుగా, వాళ్ళ ఆనందమే తన ఆనందంగా భావించేవారు రాజారాంగారు.

వేణుగోపాలరావు కలెక్టరైన సంవత్సరమే రాజారాంగారికి బాగా జబ్బు చేసింది. నగరంలోని పెద్దపెద్ద డాక్టర్లందరూ ఎంతో జాగ్రత్తగా దగ్గరుండి వైద్యం చేశారు. మంచితనానికి మారుపేరుగా మకుటంలేని మహారాజుగా పేరు తెచ్చుకొని ఓ అనాధ విద్యార్థికి అండగా నిలిచి, అతడినే అల్లుడిగా చేసుకొని ఆదర్శ వివాహాలకు అంకురార్పణ చేసిన లక్షాధికారి రాజారాంగారిని రక్షించడానికి డాక్టర్లు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఆస్తి యావత్తూ అల్లుడి పేర వ్రాసి నిశ్చింతగా అల్లుడు వేణు చేతుల్లోనే కళ్ళుమూశారు.

అప్పటికే గర్భవతిగా వున్న శోభను కంటికి రెప్పలా కాపాడుకొని తండ్రి దూరమైన దుఃఖం ఆమెకు తెలీకుండా చేయడానికి తన శాయశక్తులా ప్రయత్నించి, తన ప్రేమాదరణలతో శోభ దుఃఖాన్ని మరపించగలిగాడు వేణుగోపాలరావు. మరో ఆరు మాసాలకే దినేష్ పుట్టడంతో, రాజారాంగారే మళ్ళీ ఆ రూపంలో అవతరించాడని వేణూ శోభలు ఆనందపడ్డారు.

మామగారి మరణం వేణుగోపాల్ జీవితంలో ఓ అపశ్రుతిలా తోచినా, దినేష్ ఆగమనంతో మళ్ళీ మనసున పన్నీటి జల్లులు కురిశాయి. శోభ కూడా వేణు ప్రేమలో దినేష్ సంరక్షణలో పడి, త్వరగానే తండ్రి దూరమైన దుఃఖాన్ని మరచిపోగలిగింది.

దినేష్ రాక వారి జీవితాల్లో నవ వసంతాలను నింపింది. వాడికి తను తండ్రి ననుకుంటే ఎంతో గర్వంగా ఫీలయ్యేవాడు వేణుగోపాల్‌రావు. తనకు తల్లెవరో తండ్రెవరో తెలీదు. కానీ తన బిడ్డ దినేష్ కలెక్టర్ కొడుకు. తనకు లేని అదృష్టం తన కొడుక్కు కలిగింది. తల్లీదండ్రీ యిచ్చే ఆప్యాయత, అనురాగం ఎలాంటివో తనకు అనుభవంలోకి రాకపోయినా తన కొడుక్కు దేనికీ లోటులేదు. సమాజంలో ఓ లక్షాధికారి మనవడిగా తన కొడుకుగా, వాడికోగుర్తింపు వుంది. అది వేణు హృదయానికి అంతులేని ఆనందాన్ని కలిగించేది. ఇంతటి అదృష్టానికి తను నోచుకున్నాడంటే అందుకు మానవ రూపంలో వున్న దేవత తన శోభే కారణం.

దినేష్‌ను క్రమశిక్షణతో పెంచడమే కాకుండా, ప్రతి విషయంలో అతని అభిరుచులు తెలుసుకొని

అందుకనుగుణంగా ప్రోత్సహించేవారు.

చూస్తుండగానే సంవత్సరాలు యిట్టే గడిచి పోయాయి.

*

ప్రస్తుతం దినేష్ అమెరికాలో వున్నాడు. తన కిష్టమైన సబ్జక్ట్ తీసుకొని రిసెర్చి చేయాలనే వుద్దేశ్యంతో అమెరికా వెళతానన్న కొడుకును వదిలి వుండటం కష్టమనిపించినా అతని అభివృద్ధికి అవరోధం కలిగించటం యిష్టంలేక, బాధను మనసులోనే దిగమ్రింగి అతన్ని అమెరికా పంపారు దంపతులిద్దరూ.

ఐ. ఏ. యస్ ఆఫీసర్‌గా, వి. జి. రావ్‌కు నగరంలో మంచి పేరూ పలుకుబడీ పెరిగాయి. కొడుకు పెళ్ళీడుకు వచ్చినా రావుగారిలో వృద్ధాప్యం చోటు చేసుకోలేదు - అది ఆమడ దూరానే నిలిచి పోయింది. నిజానికి వీళ్ళిద్దరినీ ఒక్కచోట చూస్తే అన్నదమ్ములనుకుంటారు తప్ప తండ్రీ కొడుకు లంటే నమ్మరు. దినేష్‌కు తండ్రి పర్సనాలిటీ తల్లి రంగూ వచ్చినా తండ్రి ముఖంలో వున్న ఠీవీ, రాజసం కొరవడ్డాయి. అందుకే రావుగారిలో ఏదో తెలీని అందం చాలామంది సొసైటీ లేడీస్‌ను ఆకర్షించేది.

అయినా ఆయనెప్పుడూ మహిళామండలి సభ్యురాండ్రకు సాధ్యమైనంత దూరంగా పారిపోయేవాడు. వాళ్ళు ఏదో వంకతో ఆయన దగ్గిరకు వచ్చినా శోభని వాళ్ళమీద ప్రయోగించి తను తప్పుకుంటుండేవారు.

దినేష్ అమెరికా వెళ్ళిన రెండు సంవత్సరాలకు ఇంటికోసమని చక్కటి ప్లాన్ పంపాడు. ఆ ప్లాన్ ప్రకారం ఇల్లు కట్టించి, దాంట్లోకి షిఫ్ట్ అవమని, తను వచ్చేటప్పటికి మమ్మీ, డాడీ ఆ పాత ఇంటిని వదలి కొత్త ఇంట్లోచేరి స్వాగతమివ్వాలని వ్రాశాడు.

దినేష్ కోరిక విని నవ్వుకున్న రావుగారు ఆ మర్నాడే తను కొత్తగా కొన్న ప్లాట్ దగ్గరకు ఓ మంచి ఇంజనీర్‌ను తీసుకుని వెళ్ళి ఆ ప్లాన్ ప్రకారం ఇల్లు కట్టమని ఆజ్ఞలు జారీ చేసి వచ్చేశాడు.

అంతటితో వూరుకోకుండా రోజూ అక్కడికి వెళ్ళి పనులు సక్రమంగా అవుతున్నాయో లేదో చూసి వచ్చేవారు. శోభతోసహా వెళ్ళి దగ్గరుండి ఆ పనులు చేయిస్తుంటే అనిర్వచనీయమైన ఆనందమేదో రావుగారి అణువణువునూ స్పృశించి పులకరింపజేసేది.

శోభనూ, ఆ ఇంటినీ వున్నత విద్యావంతుడై త్వరలో తమను చేరబోతున్న దినేష్‌నూ, తలుచుకుంటూంటే....మనసులో అనంతమైన తృప్తితో పాటు, అంత సాధించగలిగిన తన అదృష్టానికి మురిసిపోయేవాడు వేణుగోపాలరావు.

అనుకున్న టైమ్‌కు ముందే భవన నిర్మాణం పూర్తయింది. ఇల్లు కట్టడానికి ముందే వేసిన మొక్కలు రకరకాల పూలతో ఆ యింటికి మరింత అందాన్ని సౌరభాన్ని కలిగిస్తుంటే అది చూసి చిన్నపిల్లల్లా మురిసిపోయేవారు శోభాదేవి, రావుగారు.

పాత భవనాన్ని వదలి కొత్త యింటికి వెళ్ళుతుంటే ఆ యింటితో పెనవేసుకున్న మధుర స్మృతులు రావుగారిని శోభాదేవినీ బాధ పెట్టాయి. రాజారాంగారు స్వయంగా కట్టించిందా "దేవీ నిలయం". అందుకే దినేష్ పాత యింటిని అమ్మేయమని రాసినా రావుగారు ఆ యింటిని అలాగే వుంచి కొత్త ఇల్లు కట్టించారు. కన్నీళ్ళతో దేవీ నిలయం వైపు చూస్తూ కార్లో కూర్చుంటున్న శోభాదేవి ముఖం తన చేతుల్లోకి తీసుకుంటూ—

"శోభా! బాధ పడుతున్నావా? మనకు రావాలనిపించినప్పుడల్లా యిక్కడికే వచ్చి వుందాం. అదీ దినేష్ వచ్చేంతవరకూ. ఆ తర్వాత వాడికి పెళ్ళి చేసి ఆ యిల్లు వాడికి అప్పగించి, నేను రిటైర్‌మెంట్ జీవితం ప్రారంభిస్తే, మళ్ళీ మనం మన 'దేవీ నిలయంలో'!" అంటూ ప్రేమగా చూస్తూ కళ్ళు తుడుస్తున్న రావుగారి వైపు తృప్తిగా చూస్తూ చిన్నగా నవ్వింది శోభాదేవి.

కొత్త యింటికి నెమ్మదిగా అలవాటు పడుతున్నారు రావుగారు శోభాదేవి. వారింటికి ఒక ప్రక్కనే యిళ్ళున్నాయి. మరో ప్రక్క ప్లేగ్రౌండ్. సాయంత్రం పూట ఆ కాలనీ పిల్లలందరూ గుంపులుగా చేరి టెన్నిస్ ఆడుకుంటారు. శోభాదేవికి మంచి కాలక్షేపంగానే వుంది. అయితే రావుగారు ఆఫీసు కెళ్ళిన దగ్గర నుంచీ వచ్చేంతవరకూ తోచడమే కష్టంగా వుండేది. వంట మనిషి, తోట మాలి, పని మనిషి ఎంతమంది వున్నా వాళ్ళతో తను మాట్లాడే మాటలేముంటాయి?

సాయంత్రం రావుగారు ఆఫీసు నుంచీ రాగానే ఇద్దరూ గార్డెన్‌లో కుర్చీలు వేయించుకుని కబుర్లు చెప్పుకునేవారు. మధ్య మధ్య ప్లేగ్రౌండ్‌లో చేరిన పిల్లల అల్లర్లూ తగవులూ వింటూ నవ్వుకునేవారు.

*

ఆ రోజూ రోజూలాగే ఓ అర్ధగంట ముందుగా ఆఫీసుకు బయలుదేరారు రావుగారు. క్రొత్త యిల్లు ఆఫీసుకు దూరం కావడంతో తొందరగా బయలుదేరక తప్పడం లేదు. దానితో శోభాదేవికి మరింత ఒంటరితనంగానూ దిగులుగానూ అనిపిస్తోంది. ఈ మధ్య మరీ దినేష్ త్వరగా వచ్చేస్తే బావుండుననిపిస్తోంది.

డ్రైవర్ తలుపు తీసి ప్రక్కన నుంచున్నాడు. రావుగారు డ్రైవింగ్ సీట్లో కూర్చున్నారు. ఆయనకెప్పుడూ సెల్ఫ్ డ్రైవింగ్ అంటే యిష్టం. డ్రైవర్ ఎప్పుడూ బాక్ సీట్లో కూర్చోవాల్సిందే. ఒక్కోసారి ఆయనకే నవ్వొస్తుంటుంది. కొద్ది నిముషాలైనా డ్రైవర్ కలెక్టర్‌గా ఫీలవ్వవచ్చు; తనని అతని డ్రైవర్‌గా అనుకోవచ్చని. ఆ మాట విని శోభ పగలబడి నవ్వేది! "మంచి ఆలోచన. వాడు నిజంగానే మీలా ఆలోచించడం మొదలుపెడితే ఆఫీసు చేరుకున్న తరువాత కూడా, వాడు అలాగే కూర్చుని వుంటాడు, మీరు దిగి వాడి దగ్గరకెళ్ళి డోర్ తెరచి పట్టుకోవాలి. అప్పుడు చూడాలి మన రాము ముఖం" అంటూ నవ్వుతున్న అమ్మగారి వైపు భక్తిగా చూస్తూ తలవంచుకునేవాడు రాము, సిగ్గు పడుతూ.

ఆ మాటలు జ్ఞాపకం వచ్చి శోభాదేవి వైపు చూస్తూ "శోభా? నిన్న మన రామూ నువ్వన్నంత పనీ చేశాడు తెలుసా?" అంటూ పగలబడి నవ్వుతున్న రావుగారి వైపు వినయంగా చూస్తూ శోభాదేవి వైపు తిరిగి "ఉత్తదేనమ్మగారూ అయ్యగారు ఆటపట్టిస్తున్నారు నన్ను" అంటూ చిన్నగా నవ్వాడు. వాడికి ఆ యింట్లో కావలసినంత చనువూ స్వతంత్రం వున్నాయి. వాడిని డ్రైవర్‌గా కాకుండా తమ యింట్లో మెంబర్లా చూసుకుంటారు. అందుకే ఆ యింట్లో పనివాళ్ళందరికీ ఆ దంపతులంటే పార్వతీ పరమేశ్వరులే అనిపిస్తుంది.

"వస్తాను శోభా!" అంటూ కారెక్కి శోభాదేవి వైపు చూస్తూ చెయ్యి వూపిన రావుగారి కళ్ళు అప్రయత్నంగానే ప్రక్కింటి పిట్టగోడ వైపు తిరిగాయి. అలవాటుప్రకారం అక్కడ వుండే రెండు అందమైన కళ్ళ విస్ఫారితంచేసుకొని నవ్వుతున్నాయి. అమాయకంగా కనిపించే, పదిహేడు సంవత్సరాల అందమైన అమ్మాయి ఆయన వైపే చూస్తోంది. ఆయన చిన్నగా నవ్వారు. ప్రతిగా నవ్వుతూ కళ్ళు వాల్చేసిన ఆ అమ్మాయి కారు స్టార్ట్ అయి ముందుకు దూకటంతో కళ్ళెత్తి అటే చూస్తూ నుంచుంది – తీగమీద ఆరేసిన బట్టలు సర్దుతూ. కారు కనుమరుగవ్వగానే నెమ్మదిగా ఆరిన బట్టలు తీసుకొని తమ వాటాలోకి వెళ్ళిపోయింది హర్ష.

ఇది రావుగారు ఆ యింట్లో ప్రవేశించిన నెల రోజులుగా క్రమం తప్పకుండా జరుగుతూనే వుంది. తెలీకుండానే ఆ అమ్మాయి మీద ఓ రకమైన అభిమానం ఏర్పడింది రావుగారికి. శోభాదేవితో కూడా చెప్పారు. "నీకు మరీ తోచకుండా వుంటే ఆ పాపను పిలిచి కూర్చోబెట్టుకో. కాలక్షేపమవుతుంది" అని. ఆ అమ్మాయి అలా రోజూ తను వెళ్ళబోయే సమయానికి అక్కడికెలా వస్తుందో ఎందుకొస్తుందో రావుగారికి తెలీదు. బహుశా ఆ అమ్మాయికి కూడా తెలీదేమో కానీ....అదో అపురూపమైన అనుభవం. అప్రయత్నంగానే అలా ఆ అమ్మాయిని రోజూ చూడటం ఆయనకూ అలవాటైంది. ఏ రోజైనా ఆమె కనిపించకపోతే ఏదో ఒకటి మాట్లాడుతూ తాత్సారం చేసేవారు. యింతలో ఆ అమ్మాయి కనిపించేది. కారు స్టార్ట్‌చేసి నవ్వుతూ వెళ్ళిపోయేవారు.

*

ఆ రోజు మరీ బోరుగా ఒంటరిగా అనిపిస్తే,

శోభాదేవి పనిమనిషి లక్ష్మిని పిలిచి పక్కింట్లో వుండే పాపను పిలుచుకురమ్మని పంపింది. లక్ష్మి వెళ్ళి అయిదు నిముషాల్లో హర్షతో తిరిగివచ్చింది.

నవ్వుతూ "లోపలకి రామ్మా!" అంటున్న శోభాదేవి వైపు బెరుకుగా చూస్తూ లోపలికొచ్చిన హర్ష - 'అర్ధగంటలో అవిడను' ఆంటీ అని పిలుస్తూ అన్ని విషయాలూ ఫ్రీగా మాట్లాడటం మొదలు పెట్టింది.

హర్షకు తల్లిలేదనీ స్కూల్‌లో చదువుతూనే చదువుకోస్టాప్ పెట్టవలసి వచ్చిందనీ, తను తప్ప తోబుట్టువులెవరూ లేరనీ, తండ్రి తాలూకాఫీసులో యు. డి. సి. గా వున్నాడనీ, అన్ని వివరాలూ శోభాదేవి అడక్కుండానే చెప్పేసింది. ఇల్లంతా తిరిగి చూసి "అబ్బ! ఎంతందంగా కట్టారుఆంటీ! ఎన్నాళ్ళుగానో మీ యిల్లు చూడాలనుకుంటున్నాను. కానీ అంకుల్ ఏమన్నా అంటారేమోనని లోపలికి రాలేదు. మీ గార్డెన్‌లో అన్ని పూలు పూస్తాయా ఆంటీ—మీ మాలి ఒక్కటంటే ఒక్క పువ్వు యివ్వమన్నా యివ్వడు. అమ్మో! అయ్యగారు కోప్పడతారు అని బెదిరిస్తాడు. ఈ కర్టెన్లు ఎక్కడ తెప్పించారాంటీ! ఇది రేడియోగ్రాం కదూ! మా పక్కింటి వాళ్ళదగ్గర చిన్నది వుంది. దానికే వాళ్ళు మహా పోజు కొడతారు. ఇలా ఫుల్‌స్టాపులూ కామాలూ లేకుండా మాట్లాడి, ఎదురుగా వున్న రాజారాంగారి ఫోటో చూసి "అమ్మో! ఎంతపెద్ద మీసాలో! ఆయనెవరాంటీ?" యిలా ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించి తమయింటి వివరాలన్నీ చెప్పటమే కాకుండా ఆ యింటి వివరాలన్నీ తెలుసుకుంది.

ఆ రోజు టైమ్ యిట్టే గడిచిపోయింది. కారు హారన్ వింటూనే కాఫీ కప్పు టేబుల్ మీద పెట్టేసి 'అమ్మో! అంకుల్ వచ్చేశారు. మళ్ళీ రేపు వస్తానాంటీ' అంటూ పరుగెడుతున్న హర్షను శోభాదేవి ఆపే ప్రయత్నం చేసేలోపల రావుగారికి ఢీకొట్టబోయి తప్పుకుని చిన్నగా నవ్వుతూ తమ యింట్లోకి పరుగెత్తింది హర్ష.

ఆ రాత్రి శోభాదేవి చాలా ప్రొద్దుపోయేవరకూ హర్ష కబుర్లు చెబుతూనే వుంది. వింటూనే నిద్రలోకి జారుకున్నారు రావుగారు.

*

అలా ఆ యింటికి అలవాటైన హర్ష క్రమం తప్పకుండా రోజూ శోభాదేవి దగ్గర కూర్చుని కబుర్లు చెబుతూ మధ్య మధ్య రికార్డ్స్‌పెట్టి వింటూ ఆ యింట్లోని ప్రతి అందమైన వస్తువునూ చేత్తో పట్టుకుని చూస్తూ ముచ్చటపడుతుండేది. పని పిల్ల లాంటి మన స్తత్వం యింకా వదలలేదు హర్షను అనుకునేవారు శోభాదేవి.

ఆ రోజు ఆల్బమ్ తిరగేసి చూస్తూ రావుగారి ఫోటో దినేష్ ఫోటో ప్రక్క ప్రక్కనే చూసి "ఈయన ఎవరు ఆంటీ అంకుల్‌కు తమ్ముడా?" అంది. పెద్దగా నవ్వుతూ "అది దినేష్ ఫొటో" అని శోభాదేవి చెబుతుంటే అలాగే చూస్తూ కూర్చుంది హర్ష.

హర్ష ఏదో ఆలోచనలో వుండడం చూసి చిన్నగా నవ్వుకుంటూ—

"నువ్వు చూస్తూండు హర్షా. నేను స్నానం చేసి వస్తాను" అంటూ లోపలికెళ్ళారు శోభాదేవి.

రావుగారి ఫోటో చూస్తుంటే హర్షకు ఆయనో గ్రీక్ రాకుమారుడిలా కనిపిస్తున్నారు. అంత వయసు వచ్చినా ఆయనలో వున్న అందం వదో వంతు కూడా దినేష్‌కు లేదు. మంచి పర్సనాలిటీ అతనిది కూడా, కానీ కనుముక్కు తీరు రావు గారిలా తీర్చిదిద్దినట్లుండదు.

రోజూ ఆయన స్వయంగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళుతుంటే ఎంత అందంగా హుందాగా కనిపిస్తారు! చూస్తుంటే అలాగే చూస్తూ వుండి పోవాలనిపిస్తుంది.

ఆయన ఫోటోవైపు చూస్తూ అలా మైమరచి కూర్చుని వున్న హర్షకు అలా ఎంతసేపు గడిచి పోయిందో తెలీలేదు.

స్నానం చేసి వచ్చిన శోభాదేవి—

"ఏమిటి హర్షా యింకా ఆల్బం చూడ్డం కాలా? మా అబ్బాయికి దిష్టి తగిలేను. అదే పనిగా చూస్తున్నావు" అనడంతో వులిక్కిపడి ఆల్బమ్ మూసివేసి లేచి నిల్చుంది.

అప్పుడప్పుడూ వున్నట్లుండి అలా మౌనంగా మారిపోయే హర్ష మీద అంతులేని దయా సానుభూతి శోభాదేవికి. ఆడపిల్లలు లేని ఆమె మనసుకు హర్షను చూస్తే ఏదో తెలీని ఆప్యాయత, ఆత్మీయత.

తల్లి లేకపోవడం వల్ల యింట్లో పనంతా తనే చూసుకోవాలని, తను కోరుకున్నట్లు చదువుకోలేక పోయానని బాధపడే హర్షను చదివించాలనే బలమైన కోరిక కలిగినా హర్ష తండ్రికి అంతకంటే ఎక్కువ చదివించడం ఏ మాత్రం యిష్టం లేదని విన్న తర్వాత ఆ కోరికను మనసులోనే దాచుకుంది శోభాదేవి.

ఏదో ఆలోచనలో మునిగిపోయిన హర్షను చేయి పట్టుకుని కూర్చోబెడుతూ 'నీకు జడ వెయ్యనా హర్షా! ఇవ్వాళ మన మాలి చేత నీకు

[28 వ పేజీ చూడండి]

[లోకజ్ఞానం: సమాధానాలు]

1. పారిస్ నగరంలో.
2. సిరియస్ ఏ. ఈ నక్షత్రానికి 'డాగ్ స్టార్' అని మరో పేరు వుంది. సూర్యునికంటె 26 రెట్లు అధికంగా కాంతిని వెదజల్లుతుంది ఈ నక్షత్రం.
3. జస్టిస్ హిదయతుల్లా.
4. భరతనాట్యం, కథక్, కథకళి, కూచిపూడి, మణిపూరి, ఒడిస్సీ నృత్యాలు.
5. భూమి మీద ఏర్పడే కేంద్రోద్గామిశక్తి అనబడే 'సెంట్రిఫ్యూగల్ ఫోర్స్' వల్ల మనుష్యులతో పాటు జీవరాశులన్నీ కూడా గాలిలో తేలడం ప్రారంభిస్తాయి.
6. 1885లో. అల్లన్ అక్టావియమ్ హ్యూమ్ స్థాపించారు.
7. విశ్వభారతి. పశ్చిమబెంగాల్‌లోని శాంతినికేతన్‌లో ఈ విశ్వవిద్యాలయాన్ని టాగూర్ స్థాపించారు.
8. హిందూ కళాశాల, కలకత్తా. 1817లో ప్రారంభించబడిన ఈ కళాశాల ప్రస్తుతం ప్రెసిడెన్సీ కళాశాలగా వ్యవహరింపబడుతోంది.
9. డాక్టర్ ధర్మేంద్ర ప్రఖ్యాతి చెందిన కుష్టువ్యాధి నిపుణుడు. కుష్టువ్యాధి నిర్మూలనకు ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1970లో డాలియన్ డాల్టన్ అవార్డు పొందారు. ఈ బహుమతి పొందిన ప్రప్రథమ భారతీయుడు ఈయనే.
10. ట్రాన్స్‌వాల్, దక్షిణాఫ్రికా. ద్వితీయ స్థానం సోవియట్ రష్యాకు చెందుతుంది.

[పెద్దకథ : 25వ పేజీ నుంచి]

కావలసిన పూలన్నీ కోయించాను. మాల కట్టి పెడతాను." అంటున్న శోభాదేవి మాటలతో మళ్ళీ మామూలుగా అయిపోయి, నవ్వుతూ ఆమె ముందు కూర్చుంది హర్షజడ విప్పుకుంటూ.

హర్షకు జడ వేస్తుంటే, పూలు పెడుతుంటే, ఏదో తెలీని తృప్తి ఆనందం శోభాదేవికి. తమకు యింక పిల్లలు పుట్టే యోగం లేదు. అది దినేష్ పుట్టగానే తెలిసింది. అందుకే దినేష్‌ను అపురూపంగా పెంచుకున్నారు.

దినేష్ యిండియా వచ్చి త్వరగా పెళ్ళి చేసుకుంటే మనవరాలినైనా ఎత్తుకుని మురిసి పోవాలని వుంది. అందుకే వాడి రిసెర్చి ఎప్పటికి పూర్తవుతుందో, ఎప్పటికి తిరిగి వస్తాడో అనుకుంటూ వుంటుంది. ఆడపిల్లలంటే ఆమె కున్న ముచ్చట తీర్చే చిన్నపిల్లలెవరూ దొరకలేదు ఆమెకు. ఇన్నాళ్ళకు హర్ష దొరకడంతో, మనసులో మరుగున పడిన కోరికలు తలలెత్తుతున్నాయి. హర్షను అలంకరించి అందంగా చూసుకోవాలనిపిస్తోంది.

హర్షకూ శోభాదేవి ఆదరణ — ఎప్పుడో చనిపోయిన తల్లిని గుర్తుకు తెస్తుంటే మౌనంగా ఆవిడ చేసే అలంకరణలన్నీ షేయించుకుంటుండేది. రావుగారు వచ్చేవరకూ ఆ యింటికి సర్వాధికారిణిలా ఆ యింట్లో తిరిగే హర్ష, ఆయన రాగానే జారుకునేది. శోభాదేవి ఎంతో ఆపాలని ప్రయత్నించినా ఆగేదికాదు.

*

ఆ రోజు రోజూ కంటే ముందుగా ఆఫీసు నుంచి వచ్చేసిన రావుగారికి, గుమ్మంలో అడుగు పెడుతూనే సోఫాలో వాలుగా పడుకొని, స్టీరియో నుంచి వినిపిస్తున్న పాటకు అనుగుణంగా గొంతు కలిపి పెద్దగా పాడుతున్న హర్ష హాల్లోనే దర్శనమిచ్చింది.

ఎప్పుడు ఎదురుపడినా బిడియంగా తప్పుకొని పారిపోయేది హర్ష. హర్షను గురించిన కబుర్లు శోభ ద్వారా వినడం తప్ప హర్షతో స్వయంగా ఎప్పుడూ మాట్లాడే అవకాశం కలగలేదు. 'కలక్టర్ అంటే దెయ్యమో భూతమో అనుకుంటుందా హర్ష?' అనేవారు రావుగారు.

"ఏమో దానికలాగే కనిపిస్తున్నారేమో!" అంటూ చిలిపిగా నవ్వేది శోభాదేవి.

బూట్లు టకటకలాడించుకుంటూ హడావుడిగా హాల్లో అడుగుపెట్టిన రావుగారిని చూసి వులిక్కిపడి, పాట తక్కున ఆపేసి, లేచి నుంచుని పారిపోవడానికి ప్రయత్నిస్తున్న హర్ష-పెదవులు సన్నగా కంపిస్తుండగా, సిగ్గుతో ఎర్రగా గులాబీల్లా మారిన బుగ్గలను రాసుకుంటూ ఏం చేయాలో ఎలా తప్పించుకోవాలో, తోచని అయోమయ పరిస్థితిలో చిక్కుబడిపోయింది.

హర్ష లేవగానే వెనక్కెళ్ళి నవ్వుతూ గుమ్మానికడ్డంగా నుంచున్న రావుగారిని దాటుకునిపోయే అవకాశంలేదు. లోపలి కెళ్ళి వంటగదిలో నుంచి పారిపోదామంటే ఆయన ఏమనుకుంటారోనని భయం. తను ఆ యింట్లో అంత చనువుగా తిరుగుతుందని ఆయనకు తెలుసోతెలీదో! ఏం చేయాలో తోచని సంకట పరిస్థితి. ముందుకూ పోలేదు వెనక్కూపోలేదు.

మౌనాన్ని భంగం చేస్తూ మళ్ళీ లోపలికి రెండడుగులు వేసిన రావుగారు చిన్నగా నవ్వుతూ- "ఇంత లాభం లేదు కూర్చో హర్షా! నిలబడిపోయావేం!" అంటూ తనూ ఓ సోఫాలో కూర్చున్నారు.

తప్పనిసరిగా సోఫాలో కూలబడ్డ హర్ష ఓసారి కళ్ళెత్తి రావుగారివైపు చూసింది ధైర్యంచేసి.

అందంగా టక్ చేసిన వైట్ పాంటూ షర్టూ; తెల్లటి గీతలున్న బ్లూ కలర్ టై; అందంగా ముఖాన అల్లల్లాడుతున్న వుంగరాలు తిరిగిన క్రాపూ. మచ్చుకైనా ఒక్క వెంట్రుక కూడా తెల్లబడలేదు. నవ్వుతున్నప్పుడు కొద్దిగా వంపు తిరిగే ఆ పెదాలూ, అవన్నీ అలా అంత దగ్గరగా చూస్తుంటే.... హర్షకు ఓ అద్భుత సౌందర్య మూర్తిని చూస్తున్న భావన.

ఆయనలో వయసు తెచ్చిన మార్పులేమీలేవు. పాతిక ముప్ఫై ఏళ్ళ యువకులెవరూ ఆయనకంటే అందంగా ఆరోగ్యంగా వుండరు. వుండలేరు. ఆయన వయసును మోసం చేసిన వ్యక్తి. రెప్ప వాల్చకుండా తనవైపే చూస్తూ ఏదో తన్మయంలో మునిగిపోయిన హర్ష ముఖభావాలకు ఏదోలా అయిపోయిన రావుగారు—

"శోభా! కాఫీ!" అంటూ కేకేశారు. టై విప్పుకుంటూ. సర్దుకొని కూర్చుంటూ నెమ్మదిగా కళ్ళు వాల్చేసిన హర్ష అంతసేపూ ఆయన్నలా చూసిన తన తెలివి తక్కువతనానికి కించపడుతూ మౌనంగా తల వంచుకొని కూర్చుంది.

పెద్దపెద్ద కనురెప్పలు క్రిందకు వాల్చి బుద్ధిగా కూర్చుని అరచేతులు రుద్దుకుంటున్న హర్షనూ, నెమ్మదిగా బూట్లు విప్పుకుంటున్న రావుగారినీ, చూసి నవ్వుతూ వచ్చిన శోభాదేవి—

"ఏం హర్షా! ఒక్కసారే అలా మూగదానివై పోయావేం! మీ అంకుల్‌ను చూస్తే మాటలు రావడం లేదా! ఇప్పటివరకూ హాలు కప్పు లేచిపోయేట్లు పాటలు పాడిందండీ!" అంటూ ఓ కప్పు రావుగారికిచ్చి మరో కప్పు హర్ష ముందుంచి, తనో కప్పు తీసుకుంటూ కూర్చుంది.

సిగ్గుగా తల మరింత వంచేసిన హర్ష-పెదాల మీద విరిసీ విరియని నవ్వుతో నెమ్మదిగా లేచి నుంచుని—

"ఆంటీ! యింక నేనింటికి వెళతాను. నాన్నగారు వచ్చే టైమైంది."

"కాఫీ తీసుకో హర్షా! వెళ్ళొచ్చులే! మీ నాన్నగారు యిప్పుడే రారని నాకు తెలుసులే. ఒక్కదానివీ బిక్కుబిక్కుమంటూ వుండాలి" అంటూ హర్ష చేయి పట్టుకొని కూర్చోబెడుతూ రావుగారివైపు తిరిగి -

"ఏవిటీ రోజు దొరగారు పెందలాడే వేంచేశారే! క్లబ్బు మిత్రులెవరూ తగల్లేదా?" అంది నవ్వుతూ.

"అలాగేం కాదు లేవమ్మా! ఈరోజు ముందుగా రావాలనే వచ్చాను. చాలా రోజుల్నుంచీ సినిమా కెళ్ళాలనుకుంటుంటే తీసుకెళ్ళడం లేదని సణుగుతున్నావు కదా అందుకని. త్వరగా తయారవండి పిక్చర్ కెళదాం. ఈలోపు డ్రైవర్‌ను పంపి టికెట్స్ తెప్పిస్తాను" అంటూ నవ్వుతూ కప్పు టీపాయ్ మీద పెట్టి లోపలికెళుతున్న రావుగారివైపు చూసి, తన కప్పు కూడా టీపాయ్ మీద పెట్టేసి దిగ్గున లేచి—

"ఆంటీ! మరి నే వెళ్లొస్తాను. మీరు పిక్చర్ కెళ్ళండి." అంటున్న హర్షను వారిస్తూ—

"నో! నో! అలా వీల్లేదు. మధ్యాహ్నమేగా చెప్పావు ఈ రోజు నాన్నగారు రాత్రి పదకొండు గంటలకుగానీ రారని. పద అంకుల్ రమ్మంటున్నారుగా, నువ్వూ మాతోపాటు పిక్చర్‌కు రా. మీ నాన్నగారికి మాలి చెపుతాడులే."

"ఆంటీ!"

"మరేం మాట్లాడకు. వెళ్ళి ముఖం కడుక్కో" అంటూ బాత్‌రూంవైపు తోసింది శోభాదేవి.

తప్పనిసరిగా ముఖం కడుక్కుని వచ్చిన

హర్షకు జడవేసి తలనిండా జాజిపూలు తురిమి తన ప్రక్కనే కూర్చోబెట్టుకొని తృప్తిగా చూసుకుంటున్న శోభాదేవిని రావుగారు హెచ్చరించడంతో తనూ లేచి డ్రస్ మార్చుకొని వచ్చింది. ఈలోపల రావుగారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ కూర్చున్న హర్షకి బెరుకు తగ్గింది. ఆయనంటే వున్న అభిమానం ఆయనతో మాట్లాడిన తర్వాత మరింత పెరిగింది.

"హర్షా యిలారా!" అంటూ బెడ్‌రూమ్ నుంచి కేక వేశారు శోభాదేవి.

"ఇప్పుడే వస్తాను అంకుల్" అంటూ లోపలికెళ్ళింది హర్ష.

బీరువా ముందు నుంచుని చీరలవైపు, హర్షవైపూ చూసిన శోభాదేవి—

"హర్షా! నువ్వీ చీర కట్టుకో బావుంటుంది" అంటూ హర్ష వొంటిమీద వున్న బ్లూ జాకెట్‌కు మాచ్ అయ్యే బ్లూ మీద ఎరుపూ తెలుపూ కలిపి ఎంబ్రాయిడరీ చేసిన షిఫాన్ చీర ముందుకు జరిపింది.

ఆ చీరను ఓసారి చేతుల్లోకి తీసుకొని దాని మెత్తదనాన్ని స్పృశించి చూచిన హర్ష -

"వద్దు ఆంటీ. నేనిలాగే వస్తాను. నాకు యింత ఖరీదు చీర వద్దు. మీరు మరోలా అనుకోకండి." అంటూనే అభిమానంగా వెనక్కు తిరిగిన హర్ష భుజం పట్టుకొని ఆపుతూ—

"హర్షా! నా దగ్గర యిలాంటి చీరలు చాలా వున్నాయి. ఇవి యిప్పుడు నేనెలాగూ కట్టలేను. ఎవరో ఒకళ్ళు కట్టుకుంటే నయం కదూ—అలా బీరువాలో పడేసి వుంచే కంటే. నాకు ఆడపిల్లలెవరూ లేరు. వుంటే వాళ్ళు నీలా అని వుండేవాళ్ళు కారు. నీకు బలవంతంగా కట్టించాలని నా అభిమతం కాదు. ఇది నువ్వు కట్టుకుంటే నాకు తృప్తి. నీకిష్టం లేకపోతే వద్దు." అంటూ బయటకు అడుగులు వేసిన శోభాదేవిని చూస్తూ— కళ్ళలో చిప్పిల్లిన నీటిని నెమ్మదిగా చేతుల్తో అద్దుకొని మౌనంగా ఆ చీర తీసుకొని కట్టుకుంది హర్ష.

ఎదురుగా డ్రెస్సింగ్ మిర్రర్‌లో కనిపిస్తున్న తన రూపం తనకే క్రొత్తగా అనిపించింది.

హాల్లో సోఫాలో కూర్చొని మాట్లాడుకొంటున్న రావుగారూ, శోభాదేవి యిద్దరూ, ఆ చీర కట్టుకొని బయటకు వచ్చిన హర్షవైపు రెప్పవాల్చకుండా చూశారు. శోభాదేవి కళ్ళు తృప్తిగా మెరిశాయి.

రావుగారి కళ్ళు వో క్షణం ఆ అద్భుత సౌందర్యాన్ని చూసి వెలిగినా, అంతలోనే ముకుళించుకుపోయింది హృదయం. శోభ బాధ అర్థమైన ఆయనకు ఆమె హర్ష మీద అంతటి ఆత్మీయత పెంచుకోడం ఎందుకో మంచిది కాదేమో అనిపించింది. ఎంతైనా పరాయిపిల్ల తమ పిల్ల కాదు గదా! అనుబంధాలు పెంచుకుంటే తెంచుకోలేక శోభ బాధపడాల్సి వస్తుందేమోనని ఆయన భయం.

పిక్చర్ చూస్తున్నంతసేపూ హర్షకు అందులోని హీరోని తన అంకుల్ రావుగారితో పోల్చుకోడం, చివరకు ఆ హీరోకంటే అంకుల్ ఎన్నో రెట్లో బావున్నారనే నిర్ణయానికి రావడం జరిగింది.

అలా రెండు మూడు సందర్భాల్లో వాళ్ళతో కలసి బయటకు వెళ్ళడం వారితోపాటే భోంచేయడం వీటితో హర్ష పరాయిపిల్ల అన్న భావనే లేకుండా పోయింది శోభాదేవిలో. రావుగారితో కూడా కూర్చుని చర్చలకు దిగే హర్షను చూస్తే ముచ్చట వేసేది.

దానికి తగ్గట్టు పుస్తకాల పురుగు హర్ష. సాహిత్యమంటే మొదటినుంచీ ఉత్సాహం ఎక్కువైన రావుగారు—యింట్లో పెద్ద లైబ్రరీయే పెట్టుకున్నారు. రోజూ ఓ పుస్తకం చదవడం దానిలో పాత్రల గురించి తనకు తెలిసిన భాషలో ఆయనతో వాదించి తన మాట నెగ్గించుకోడానికి ప్రయత్నం చేయడం హర్ష ముఖ్యమైన పనుల్లో ఒక పని. కొంచెం సేపు సరదాగా వాదించినా హర్షను నొప్పించడం యిష్టం లేక హర్షకు అనుకూలంగా చివరికి వాదాన్ని అంగీకరించి, అంకుల్ ఓడిపోయారని మెరిసే కళ్ళతో చూస్తూ పకపకానవ్వే హర్షను మరింత నవ్వించి, చూడటం రావుగారికి ఓ దినచర్యగా మారిపోయింది.

దినేష్ అమెరికా వెళ్ళిపోయిన తర్వాత ఆ ఇంట్లో గూడు కట్టుకున్న నిశ్శబ్దం హర్ష కిలకిల నవ్వులతో, రోజూ సాయంత్రం రావుగారి తోటలో కుర్చీలు వేసుకొని కూర్చుని చేసే చర్చలతో, కాలం అతి త్వరగా పరుగులు తీస్తోంది. శోభాదేవికి యిప్పుడు తోచక పోవడమన్న సమస్య లేదు. కావల్సినంత కాలక్షేపం హర్ష. తండ్రి ఆఫీసుకెళ్ళగానే రావుగారింట్లో వచ్చి వాలేది.

సాయంత్రం రోజూ వంట చేసే వచ్చి ఏ పది గంటలకో తండ్రి రాగానే వాళ్ళింటికి చేరుకునేది. అప్పుడప్పుడు ఏవైనా బయటకెళ్ళే కార్యక్రమాలు వుంటే తండ్రికి ముందే చెప్పి ఆ రాత్రికి రావుగారింట్లో దినేష్ రూమ్‌లో పడుకునేది. హర్ష తండ్రికి కూడా యిప్పుడు రాత్రి ఎంత ప్రొద్దుపోయొచ్చినా హర్ష ప్రశ్నలకు జవాబులు చెప్పే బాధ తప్పింది. హాయిగా ఏ ఫ్రెండ్‌తోనో కూర్చుని పేకాడుతూ తెల్లవార్లూ అక్కడే వుండిపోయినా యిప్పుడు హర్షను గురించిన భయం లేదు. రావుగారింట్లో సురక్షితంగా వుంటుందన్న ధైర్యం అతనికి ఓ నిశ్చింతను కలిగిస్తోంది. [సశేషం]

చిల్డ్రన్స్ చార్టర్



బాలల హక్కులను పరిరక్షించడానికి ప్రప్రథమంగా 1942లో 19 దేశాలకు చెందిన విద్యావేత్తలు లండన్‌లో సమావేశమయ్యారు. వారు రూపొందించిన చార్టర్‌లో ఆరు ప్రధానాంశాలు వున్నాయి. అవి:

1. బాలల వ్యక్తిత్వ వికాసమన్నది పవిత్రమైనదిగా భావించాలి. బాలల ముఖ్యావసరాలలో చక్కటి విద్యా విధానం కూడా ఒకటి అన్నది మరువకూడదు.
2. ప్రతి బాలునికి/బాలికకు, సరైన ఆహారం, బట్ట, యోగ్యమైన నివాస స్థలం - వీటిని కల్పించాల్సిన బాధ్యత ఆ దేశం మీద వుంది. అంతేకాదు - అవే తాము నిర్వహించవలసిన ప్రప్రథమ కార్యక్రమాలుగా ఆయా దేశ ప్రభుత్వాలు భావించాలి.
3. ప్రతి బాలునికి/బాలికకు వైద్య సదుపాయాలు కల్పించాలి.
4. బాలలందరికీ కూడా తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు అన్ని అవకాశాలు అందుబాటులో వుండేటట్లు చూడాలి.
5. పిల్లలకి ఉదయం నుంచి సాయంత్రం దాకా వుండే పాఠశాలలు తెరిపించాలి.
6. సంస్కృతికి, నైతిక విలువలకీ సంబంధించిన శిక్షణ కూడా పిల్లలకు లభించేటట్లు చూడాలి.